సాక్షి
కాకినాడ
మంగళవారం । 12 । మార్చి । 2024



రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి అద్దంకి సతీష్, దుర్గా శ్యామల దంపతులు (బెంగళూరు) సోమవారం రూ.లక్ష విరాళం సమర్పించారు.



ఇక పారిశ్రామిక పరుగులు

రాజానగరం మండలం కలవచర్లలో ఏర్పాటు చేయనున్న ఇండస్ట్రియల్ పార్కుకు రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాథ్ నేడు శంకుస్థాపన చేయనున్నారు. - 8లో▸

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళ (సా॥)	సెహరీ బుధ (ఉ॥)
రాజమహేంద్రవరం	6.21	4.52
కాకినాడ	6.21	4.52
అమలాపురం	6.21	4.52

న్యూస్‌రీల్

జాయింట్ కలెక్టర్ బదిలీ



ప్రవీణ్ ఆదిత్య

కాకినాడ సిటీ: జిల్లా జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్యను ఎన్నికల నియమావళి ప్రకారం పశ్చిమ గోదావరి జిల్లా జేసీగా బదిలీ చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా జేసీగా పని చేస్తున్న ఎస్.రామసుందర్‌రెడ్డిని కాకినాడ జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జేసీ ప్రవీణ్ ఆదిత్య గత నెలలో పోలవరం ప్రాజెక్టు నుంచి కాకినాడ జిల్లా జేసీగా బాధ్యతలు స్వీకరించారు.

స్పందనకు 352 అర్జీలు



స్పందనలో వృద్ధురాలి సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమంలో ప్రజలు 352 అర్జీలు సమర్పించారు. వారి నుంచి కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య, డీఆర్‌ఓ డి.తిప్పేనాయక్, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసరావు, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, సెట్రాజ్ సీఈఓ, డీపీఓ కె భారతి సౌజన్య అర్జీలు స్వీకరించారు. ఈ అర్జీలను నిర్ణీత గడువులోగా, నాణ్యతతో పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. రీ ఓపెన్ అయ్యే అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టి, శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

వికాసలో రేపు ఇంటర్వ్యూలు

కాకినాడ సిటీ: కోటక్ మహీంద్రా బ్యాంక్‌లో అసిస్టెంట్ మేనేజర్, డిప్యూటీ మేనేజర్ ఉద్యోగాలకు బుధవారం ఉదయం 9 గంటలకు కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు సోమవారం తెలిపారు. ఈ ఉద్యోగాలకు డిగ్రీ ఉత్తీర్ణులైన 30 ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. ఆయా విభాగాల్లో అనుభవం కలిగి, ఇంగ్లిషు, హిందీ, తెలుగు భాషల్లో నిష్ణాతులై ఉండాలని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు హైదరాబాద్‌లో పని చేయాల్సి ఉంటుందన్నారు. వీరికి సంవత్సరానికి రూ.2.8 లక్షల నుంచి రూ.4.5 లక్షల వరకూ జీతం ఇస్తారని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆ రోజు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరు కావాలని లచ్చారావు సూచించారు.

ఉపాధి కార్యాలయంలో రేపు జాబ్ మేళా

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): తమ కార్యాలయంలో బుధవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పన అధికారి జి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌బీ మోటార్స్‌లో 19, భారత్ ఫైనాన్స్ సంస్థలో 150, ఫ్లిప్‌కార్ట్‌లో 100, మెడిప్లస్ ఫార్మసీలో 250, పేటీఎంలో 120, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్‌లో 270 పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారని వివరించారు. పదో తరగతి, ఆపైన, డిగ్రీ, ఫార్మసీ విద్యార్హతలు కలిగిన వారందరూ హాజరు కావచ్చని తెలిపారు. ఎంపికైన వారికి వేతనం రూ.14 వేల నుంచి రూ.25 వేల వరకూ వేతనం చెల్లిస్తారన్నారు. ఇతర వివరాలకు 0884–2373 270 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేత్రపర్వం.. శ్రీపుష్పయాగోత్సవం



పూల ఊయలలో స్వామి, అమ్మవారు

సామర్లకోట: పంచారామ క్షేత్రంలో బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వరస్వామి వారి శ్రీపుష్పయాగోత్సవం సోమవారం రాత్రి నేత్రపర్వంగా జరిగింది. కల్యాణోత్సవాల ముగింపులో భాగంగా ఈ క్రతువును వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం దంపతులు వేదికపై కూర్చుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని పూలతో అలంకరించారు. అమ్మవారి ఆలయంలో పూలు, వివిధ రకాల పండ్లు, మిఠాయిలతో అలంకరించిన ఊయలలో స్వామివారి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఉంచారు. ఈఓ దంపతులకు, భక్తసంఘం నాయకుల దంపతులకు దంపతీ తాంబూలం అందజేశారు. ఈ ఉత్సవాన్ని అధిక సంఖ్యలో భక్తులు తిలకించారు. ఉత్సవ కమిటీ సభ్యులు యండమూరి వెంకట సుబ్బారావు, నాతిపాముల సూరిబాబు, బీవీ రమణ, భక్త సంఘం నాయకులు బిక్కిన సాయి పరమేశ్వరరావు, అమలకంటి శ్రీనివాసరావు, గంజి బూరయ్య, తలుపుల అంజనీకుమార్, చల్లా సత్తిబాబులు భక్తులకు సేవలందించారు.

చిరుద్యోగుల్లో చిద్విలాసం

- కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ
- ఇచ్చిన హామీకి కట్టుబడి సీఎం జగన్ ఉత్తర్వులు
- జీవితాంతం రుణపడి ఉంటామంటున్న ఉద్యోగులు
- ఉమ్మడి జిల్లాలో 267 మందికి మేలు



కాకినాడలో డీఎంహెచ్‌ఓ నుంచి క్రమబద్ధీకరణ ఉత్తర్వులు అందుకున్న హెల్త్ అసిస్టెంట్లు (ఫైల్)

మామిడికుదురు/కొత్తపేట: శుభ తరుణం రానే వచ్చింది.. కాంట్రాక్టు బతుకులకు వెలుగులు తెచ్చింది.. రెండు దశాబ్దాల కల నెరవేర్చింది.. వైద్య, ఆరోగ్య శాఖలో పని చేస్తూ ఉద్యోగాల క్రమబద్ధీకరణ కోసం ఎదురు చూస్తున్న బడుగు ఉద్యోగుల కల ఫలించింది. ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వారి ఉద్యోగాలకు భరోసా కల్పించింది. జీఓ 30, జీఓ 31 ద్వారా వైద్య, ఆరోగ్య శాఖలో పని చేస్తున్న హెల్త్ అసిస్టెంట్లు (మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్లు–మేల్, మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్లు–ఫిమేల్, గ్రేడ్–2 ఫార్మసిస్టుల ఉద్యోగాలను పర్మినెంట్ చేస్తూ ఇటీవల జారీ చేసిన జీఓలు కాంట్రాక్టు ఉద్యోగులకు ఎనలేని సంతోషాన్ని తెచ్చింది. ఈ శుభ తరుణం కోసం గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నో పోరాటాలు చేశారు.. ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. తమకు న్యాయం చేయాలని ఎంతో మందిని కలిశారు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా ఇచ్చిన హామీలు మాత్రం నెరవేరలేదని బాధపడ్డారు. తీవ్ర నిరాశ, నిస్పృహలతో ఉన్న ఉద్యోగులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు తీపి కబురు తీసుకొచ్చింది. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు వైద్య, ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు పద్ధతిపై పని చేస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేస్తూ జారీ చేసిన జీఓ వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపింది.

ఎంతమందికి ప్రయోజనమంటే..

ప్రభుత్వం తాజాగా జారీ చేసిన జీఓ ప్రకారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 267 మంది ఉద్యోగాలు పర్మినెంట్ అయ్యాయి. జీఓ 30 ప్రకారం హెల్త్ అసిస్టెంట్లు 170 మంది, 31 జీఓ ప్రకారం మహిళా ఉద్యోగులు 44 మంది, గ్రేడ్–2 ఫార్మసిస్టులు ఎనిమిది మందికి క్రమబద్ధీకరణ ఉత్తర్వులు జారీ చేశారు. మరో 45 మందికి సాంకేతిక కారణాలతో ఉత్తర్వులు జారీ చేయడంలో కొంత జాప్యం ఏర్పడింది. వారికి కూడా ఉత్తర్వులు ఇచ్చేందుకు వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. వీరు 2003 జూన్ 3న ఉద్యోగాలు పొందారు. నాటి నుంచి నేటి వరకూ కాంట్రాక్టు ఉద్యోగులుగానే కొనసాగుతున్నారు. ఇటీవల జారీ చేసిన జీఓలతో వీరి ఉద్యోగాలు పర్మినెంట్ అయ్యాయి. తమకు భరోసా ఇస్తూ సీఎం జగన్ తీసుకున్న నిర్ణయంపై వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులు పట్టరాని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సాహసోపేత నిర్ణయం



మా ఉద్యోగాలను పర్మినెంట్ చేస్తూ తీసుకున్న నిర్ణయం సాహసోపేతం. మాకు నరకం నుంచి విముక్తి కలిగించిన మహానుభావుడు జగన్. ఆయన రుణం జన్మజన్మలకూ తీర్చుకోలేనిది. ఆయనే మళ్లీ సీఎం కావాలి. ఇదే ప్రజలూ కోరుకుంటున్నారు. మాలాంటి ఉద్యోగుల మాట కూడా అదే. ఎవరు ఎన్ని చెప్పినా నిస్సందేహంగా చెబుతున్నా.. జగనే సీఎం.

– వీఎస్‌జే కుమారి, ఏఎస్ఎం, యూపీహెచ్‌సీ, మెరక వీధి, రాజమహేంద్రవరం

ఎంతో రుణపడి ఉంటాం



ఎన్నో ఏళ్ల ఎదురుచూపులు ఇంత కాలానికి ఫలించాయి. ఇప్పటి వరకూ ఎన్నో ఇబ్బందులు పడ్డాం. చాలీచాలని జీతంతో పని చేశాం. మా జీవితాలకు ఒక దశ, దిశ నిర్దేశించిన మహానుభావుడు జగన్‌మోహన్‌రెడ్డి. మా కుటుంబం అంతా ఆయనకే తోడుగా నిలుస్తాం. ఉద్యోగుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపారు. ఈ ఆనందాన్ని వర్ణించడానికి మాటలు రావడం లేదు.

–కొమ్మూరి ఉమామహేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్, లూటుకుర్రు పీహెచ్‌సీ, మామిడికుదురు మండలం

గుండెల్లో పెట్టుకుంటాం



గత ఎన్నికల సమయంలో పాదయాత్ర చేస్తున్న జగన్‌ను కత్తిపూడిలో ఐదుగురు సభ్యులం కలిశాం. మా ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని కోరాం. మన ప్రభుత్వం వచ్చిన వెంటనే పర్మినెంట్ చేస్తామని జగన్ మాట ఇచ్చారు. ఇచ్చిన మాటను ఎక్కడా తప్పలేదు. మా ఉద్యోగాల్ని పర్మినెంట్ చేయడం అద్భుత ఘట్టం. జగన్‌ను గుండెల్లో పెట్టుకుంటాం.

– దుళ్ల చటర్జీ, ఏపీ పారా మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, రాజమహేంద్రవరం, హెల్త్ అసిస్టెంట్, ఫైలేరియా

జీవితాలకు వెలుగులొచ్చాయ్



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా జీవితాల్లో వెలుగులు నింపారు. ఆయన తీసుకున్న నిర్ణయాన్ని ఉద్యోగులందరం స్వాగతిస్తున్నాం. మా ఆనందానికి అవధులు లేవు. పాదయాత్రలో ఇచ్చిన మాట ఎక్కడా తప్పలేదు. ఎంతో మంది పాలకులు వచ్చినా మా సమస్యలు ఆలకించలేదు. ఉద్యోగులంతా సీఎంకు రుణపడి ఉంటాం.

– మొల్లేటి ఏడుకొండలు, హెల్త్ అసిస్టెంట్, నగరం పీహెచ్‌సీ

కొత్త జీవితాన్ని ప్రసాదించారు



ఇరవై ఏళ్ల నుంచి ఎంతో మంది పాలకులు వచ్చారు.. వెళ్లారు. కానీ మా వెతలు తీర్చలేదు. మాజీ సీఎం చంద్రబాబు ఎన్నో సాకులు చెప్పి మాట దాటవేశారు. పాదయాత్రలో జగన్ ఇచ్చిన హామీ నెరవేరుతుందా! లేదా! అనే సందేహంలో ఉన్నాం. ఆ హామీని జగనన్న తు.చ. తప్పకుండా నెరవేర్చారు. మాకు కొత్త జీవితాన్ని ప్రసాదించారు.

– కుడుపూడి శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్, మామిడికుదురు మండలం

నిరీక్షణ ఫలించింది



ఇరవై ఏళ్ల నిరీక్షణ సీఎం జగన్ చొరవతో ఫలించింది. మేమంతా పట్టరాని ఆనందంలో ఉన్నాం. జగన్ రుణం తీర్చుకునే అవకాశం కోసం ఆశగా ఎదురు చూస్తున్నాం. వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఆయన్ని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకతను ప్రజలకు వివరిస్తాం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే ఇంకా ఎంతో మంది జీవితాలకు వెలుగులు వస్తాయి.

– యద్ల రాజేష్, ఫార్మసిస్టు, దోసకాయలపల్లి పీహెచ్‌సీ, కోరుకొండ మండలం

చేపల వేటపై నిషేధం లేదు

- ఓఎన్‌జీసీ ఇంకా సిస్మిక్ సర్వే చేపట్టలేదు
- కలెక్టర్ కృతికా శుక్లా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ సతీష్ కుమార్

కాకినాడ సిటీ: ఓఎన్‌జీసీ ఇంకా సిస్మిక్ సర్వే నిర్వహించడం లేదని, కాకినాడ పరిసర ప్రాంత మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లడంపై ఎటువంటి నిషేధాలూ లేవని కలెక్టర్ కృతికా శుక్లా స్పష్టం చేశారు. ఓఎన్‌జీసీ, కాకినాడ సీ పోర్ట్, యాంకరేజ్ పోర్ట్, మత్స్యశాఖ అధికారులు, మత్స్యకార సంఘాల ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఓఎన్‌జీసీ ప్రస్తుతం సర్వే ఎక్విప్‌మెంట్ టెస్టింగ్ ప్రక్రియ మాత్రమే జరుపుతోందన్నారు. సర్వే వలన మత్స్యకారుల జీవనోపాధికి కలిగే నష్టాలపై అంచనాకు రాష్ట్ర స్థాయి నిపుణుల కమిటీ ఏర్పాటుకు ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ఈ కమిటీ నివేదిక ఆధారంగా పరిహారం చెల్లింపుపై నిర్ణయం తీసుకుంటారని వివరించారు. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ అనుమతులకు లోబడే సర్వే ప్రక్రియ జరుగుతుందన్నారు. సిస్మిక్ సర్వేపై ఆందోళన వీడాలని మత్స్యకారులను కోరారు. మత్స్యకార సంఘాలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమర్పించిన వినతులను కలెక్టర్ కృతికా శుక్లా స్వీకరించారు. జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ మాట్లాడుతూ, సామరస్య వాతావరణంలో సమస్య పరిష్కారానికి మత్స్యకారులు, రాజకీయ పార్టీలు సహకరించాలని, శాంతిభద్రతలకు ఎవ్వరూ విఘాతం కలిగించవద్దని కోరారు. సమావేశంలో రాజకీయ పార్టీల తరఫున కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కాకినాడ నగరాభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, తాటిపాక మధు, దువ్వాడ శేషుబాబ్జీ, మత్స్యశాఖ జేడీ కె.కరుణాకరరావు, ఓఎన్‌జీసీ అధికారులు సంజయ్‌కుమార్, సునీల్ కుమార్, యాంకరేజ్ పోర్ట్ అధికారి కె.ధర్మశాస్త్ర, కాకినాడ సీ పోర్ట్ సీఈఓ ఎం.మురళీధర్ మత్స్యకార ప్రతినిధులు పాల్గొన్నారు

టీడీపీ, జనసేనకు బై

- వైఎస్సార్ సీపీకి జై
- తుని, కాకినాడల్లో పలువురి చేరిక

తుని: టీడీపీ, జనసేన అధినేతల విధానాలు నచ్చక.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పాలనకు ఆకర్షితులైన పలువురు సోమవారం వైఎస్సార్ సీపీకి జై కొట్టారు. మండల కేంద్రమైన తొండంగిలో టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు సామాజిక వర్గానికి చెందిన పలువురు మహిళలు వైఎస్సార్ సీపీలో చేరారు. టీడీపీ నాయకుడు, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు ఆధ్వర్యాన వచ్చిన వీరికి తుని మండలం ఎస్.అన్నవరంలోని తన క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలతో పాటు మంత్రి రాజా చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులమై వైఎస్సార్ సీపీలో చేరామని ఈ సందర్భంగా వారు అన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి రాజా మాట్లాడుతూ, తొండంగి మండలంలో ఒకప్పుడు టీడీపీకి పట్టు ఉండేదని, ప్రస్తుతం ఆ నాయకులపై అసంతృప్తి పెరగడంతో పాటు, వైఎస్సార్ సీపీ సంక్షేమ పథకాలపై నమ్మకం కలగడంతో పార్టీలో చేరికలు పెరుగుతున్నాయన్నారు. తమ పార్టీపై నమ్మకంతో వచ్చే అందరికీ తగిన ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు.

మళ్లీ వైఎస్సార్ సీపీదే విజయం

కాకినాడ రూరల్: ఎంత మంది కలిసి వచ్చినా మళ్లీ వైఎస్సార్ సీపీదే విజయమని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు, పార్టీ కాకినాడ పార్లమెంటరీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ అన్నారు. వారి సమక్షంలో జనసేన కీలక నాయకుడు, కాకినాడ ఒకటో డివిజన్ ఇన్‌చార్జి సానా వెంకటరాజు (శ్రీను), కాకినాడ పోర్టు లేబర్ కాంట్రాక్టర్లు కె.నాగేశ్వరరావు, ఒ.సింగుబాబు, ఎస్.సాయి నగేష్ రెడ్డి, వారి అనుచరులు, పలువురు మహిళలు భారీ సంఖ్యలో వైఎస్సార్ సీపీలో చేరారు. రమణయ్యపేటలోని వైద్య నగర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో వారికి కన్నబాబు, సునీల్ పార్టీ కండువాలు వేసి వైఎస్సార్ సీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. కన్నబాబు మాట్లాడుతూ, పేదలు, ప్రజలతోనే తన పొత్తు అని చెబుతున్న సీఎం జగన్ మాటకు అనుగుణంగా అందరం ముందుకు సాగాలని, వైఎస్సార్ సీపీని అధికారంలోకి తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఎంపీ అభ్యర్థి సునీల్ మాట్లాడుతూ, పొత్తుల విషయంలో తీవ్రంగా మోసపోయామనే ఆవేదనతో జనసేన శ్రేణులు భారీగా ఆ పార్టీకి గుడ్‌బై చెబుతున్నారని, రానున్న రోజుల్లో వైఎస్సార్ సీపీలో మరింత భారీగా చేరికలు ఉంటాయని అన్నారు. పార్టీలో చేరిన వారికి అభినందనలు తెలిపారు. అనంతరం తూరంగి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు ఆకుల రామకృష్ణ ఆధ్వర్యాన ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సమక్షంలో మహాలక్ష్మి నగర్‌కు చెందిన జనసేన నాయకులు కర్రి చిన్నా, తారుపిల్లి నాగు, రచ్చ వీరబాబు తదితర వంద మంది వైఎస్సార్ సీపీలో చేరారు. అలాగే, ఇదే గ్రామంలో మరోచోట వైఎస్సార్ సీపీ నాయకుడు కాకిరాజు ఆధ్వర్యాన పాతర్లపల్లి రవికుమార్, కాకినాడ అప్పారావు, మనోజ్ తదితర సుమారు 200 మంది టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి కన్నబాబు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఆయా కార్యక్రమాల్లో నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ జంగా గగారిన్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య నగర్‌లో వైఎస్సార్ సీపీలో చేరిన వారితో కన్నబాబు, చలమలశెట్టి సునీల్





తొండంగి చెందిన మహిళా నాయకులను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించిన మంత్రి దాడిశెట్టి రాజా, తూరంగిలో పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కన్నబాబు


చేబ్రోలులో టీడీపీ, జనసేనకు షాక్



పార్టీలో చేరిన వారిని స్వాగతిస్తున్న ఎంపీ గీత

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలులో టీడీపీ, జనసేన పార్టీలకు గట్టి షాక్ తగిలింది. ఆ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు సోమవారం వైఎస్సార్ సీపీలో భారీగా చేరారు. కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ వంగా గీత సమక్షంలో వారు వైఎస్సార్ సీపీకి జై కొట్టారు. నంది వీధిలో యాదవ సంఘం నాయకులు పురందాసు మాణిక్యం ఆధ్వర్యాన 50 మంది, పాత ఎస్సీ పేట అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యాన 100 మంది, ఏడిద నరేష్ ఆధ్వర్యాన 25 మందితో పాటు, యాదవుల రామాలయం వద్ద శీరం పోతురాజు, యలమంచిలి గంగారావు ఆధ్వర్యాన 50 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. వారికి గీత పార్టీ కండువాలు వేసి వైఎస్సార్ సీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ ప్రెసిడెంట్ పుప్పాల బాబులు తదితరులు పాల్గొన్నారు.

క్షయపై సమరం



- జిల్లాలో 9 టీబీ యూనిట్ల ఏర్పాటు
- ఏరియా ఆసుపత్రులు, సీహెచ్‌సీలు, పీహెచ్‌సీల్లో వైద్య సేవలు
- ఆధునిక పరికరాలతో వ్యాధి నిర్ధారణ
- గతంలో వ్యాధి బారిన పడిన వారికీ పరీక్షలు
- ఉచితంగా మందులు, పౌష్టికాహారం
- చికిత్స సమయంలో రోగికి నెలకు రూ.500 అందజేత
- కేసుల సంఖ్య తగ్గించేందుకు చర్యలు

జిల్లాలో టీబీ పరీక్షలు, బాధితుల వివరాలు

సంవత్సరం	పరీక్షలు	బాధితులు
2015	18,685	2,837
2016	21,503	2,730
2017	21,026	3,500
2018	23,092	2,438
2019	27,437	3,779
2020	29,011	2,948
2021	31,798	3,604
2022	26,547	3,410
2023	47,246	3,144

కాకినాడ సిటీ: క్షయ.. నోటి తుంపర్ల ద్వారా వ్యాప్తి చెందుతుంది. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రాణం మీదకు తెస్తుంది. ఈ వ్యాధికి కళ్లెం వేసేందుకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ప్రభుత్వం ప్రతి సీహెచ్‌సీలో టీబీ యూనిట్ ఏర్పాటు చేసింది. ఈవిధంగా జిల్లాలో మొత్తం 9 యూనిట్లు ఉన్నాయి. వీటిల్లో ఒక సీనియర్ టీబీ సూపర్‌వైజర్, ఒక సీనియర్ ల్యాబ్ సూపర్‌వైజర్ విధులు నిర్వహిస్తున్నారు. వీరితో పాటు 10 మంది సిబ్బందిని ప్రభుత్వం నియమించింది. క్షయ కేసులను గుర్తించేందుకు ప్రతి సీహెచ్‌సీలో ఎక్స్‌రే యూనిట్లు ఏర్పాటు చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 10 మంది టీబీ హెల్త్ విజిటర్లు పని చేస్తున్నారు. క్షయ వ్యాధిని నిర్ధారించేందుకు కాకినాడ సర్వజన ఆసుపత్రి(జీజీహెచ్)లో రెండు సీబీ నాట్ మెషీన్లు ఏర్పాటు చేశారు. దీంతోపాటు, జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏరియా ఆసుపత్రులు, సీహెచ్‌సీలు, పీహెచ్‌సీల్లో 19 ట్రూనాట్ మెషీన్లు ఏర్పాటు చేశారు. ప్రతి ఆరోగ్య కేంద్రాన్ని మైక్రోస్కోప్ సెంటర్‌గా మార్చి టీబీ లక్షణాలున్న వ్యక్తి నుంచి కళ్లె (ఉమ్మి) సేకరించి పరీక్షలు చేస్తున్నారు. ఆ శాంపిల్‌లో టీబీ క్రిములుంటే ఆ వ్యక్తికి డాట్ ప్రొవైడర్ ద్వారా మందులు ఇస్తూ వ్యాధిని తగ్గించేందుకు 6 నుంచి 8 నెలల పాటు చికిత్స అందిస్తున్నారు.

ఉచితంగా మందులు

టీబీ చికిత్సకు జిల్లాలోని అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో ఉచితంగా మందులు అందజేస్తున్నారు. వ్యాధి వచ్చిన తర్వాత వైద్యులు సూచించిన విధంగా నిర్ణీత కాలం మందులు వాడకపోతే అది మల్టీ డ్రగ్ రెసిస్టెంట్ టీబీగా మారుతుంది. దీనికి రెండేళ్ల పాటు మందులు వాడాల్సి ఉంటుంది. టీబీ నిర్మూలనకు రూ.2 లక్షల నుంచి రూ.18 లక్షల విలువ జేసే మందులను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. మందులు మింగించిన పర్యవేక్షకులకు (డాట్ ప్రొవైడర్‌కు) రూ.వెయ్యి నుంచి రూ.5 వేల పారితోషికం అందిస్తున్నారు. క్షయ వ్యాధిగ్రస్తులకు నెలవారీ వైద్య ఖర్చులకు నిక్షయ పోషణ యోజన ద్వారా రూ.500 చొప్పున అందజేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా క్షయతో బాధ పడుతున్న 1,743 మందికి గత ఏడాది ప్రతి నెలా రూ.500 చొప్పున రూ.4,19,7000 జమ చేశారు.

ఆధునిక పరికరాలతో పరీక్షలు

వ్యాధిని కచ్చితంగా నిర్ధారణ చేసే సీబీ నాట్ మెషీన్లు కాకినాడ జీజీహెచ్‌తో పాటు తాళ్లరేవు, పెద్దాపురం, పండూరుల్లోని ఆసుపత్రుల్లో ఏర్పాటు చేశారు. ఈ మెషీన్ హెచ్‌ఐవీ రోగులు, ఊపిరితిత్తుల వ్యాధులున్న వారు, చిన్న పిల్లలల్లో క్షయ, ఎండీఆర్ టీబీని గుర్తించడంలో కీలకంగా ఉంటుంది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 1,244 మంది క్షయ బాధితులకు చికిత్స అందిస్తున్నారు. వీరికి నిక్షయ్ మిత్ర ద్వారా, దాతల సహకారంతో పోషకాహార కిట్లు అందజేసేలా చర్యలు చేపట్టారు. ఇందులో 673 మంది నమోదు చేసుకుని రోగులకు పౌష్టికాహారం అందజేస్తున్నారు. వీరిలో కొంతమంది కొందరు రోగులను దత్తత తీసుకుని, మరీ వారికి కావాల్సిన పౌష్టికాహార కిట్లు అందజేస్తూండటం విశేషం.

క్షయ నిర్మూలనే లక్ష్యం



జిల్లాను క్షయ రహితంగా చేయడమే లక్ష్యంగా టీబీ రోగులకు చికిత్స అందిస్తున్నాం. అదే సమయంలో నివారణపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు 2030 నాటికి క్షయ ముక్త భారత్ లక్ష్యంతో ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ జె.నరసింహ నాయక్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి, కాకినాడ

క్రమం తప్పకుండా మందులు వాడాలి



జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్షయ వ్యాధి నివారణ మందులు అందుబాటులో ఉన్నాయి. వ్యాధిగ్రస్తులు డాట్ ప్రొవైడర్ ద్వారా ఈ మందులు తీసుకుని వాడాలి. వ్యాధి నిర్ధారణ అయిన తరువాత వైద్యుల సూచన మేరకు క్రమం తప్పకుండా మందులు వాడాలి. క్షయ లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలి.

– డాక్టర్ ఆర్.రమేష్, జిల్లా క్షయ నివారణ అధికారి, కాకినాడ

క్లుప్తంగా

అక్రమ రేషన్ బియ్యం స్వాధీనం


యర్రమట్టిపురంలో పట్టుకున్న అక్రమ రేషన్ బియ్యంతో విజిలెన్స్ అధికారులు

రాయవరం: చెల్లూరు గ్రామ పరిధి యర్రమట్టిపురంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు సోమవారం పట్టుకున్నారు. కోట సత్యం అనే వ్యక్తి 24 బస్తాలలో సుమారు 1,035 కిలోల పీడీఎస్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించారు. చెల్లూ రు, పసలపూడి గ్రామాల్లో రేషన్ కార్డు దారుల నుంచి కిలో రూ.14కు కొనుగోలు చేసి మొక్కజొన్న విత్తనాలతో కలిపి రూ.16కు కోళ్ల ఫారాలకు విక్రయిస్తున్నట్లు తెలుసుకున్నారు. ఈ బియ్యం విలువ సుమారు రూ. 53,092 ఉంటుందని అంచనా వేశారు. బియ్యంతో పాటు ఎలక్ట్రానిక్ కాటాను సీజ్ చేసి, 6ఏ కింద కేసు నమో దు చేశారు. నిందితుడు కోట సత్యం, సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసు నమోదుకు సిఫార్సు చేస్తున్నట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్వీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ మూడు జిల్లాల్లో చౌక బియ్యం అక్రమ నిల్వలు, రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతుందన్నా రు. ఎవరైనా ఈ బియ్యం కొనడం, అమ్మడం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారి జగన్నాథరెడ్డి, రాయవరం సివిల్ సప్లయిస్ సిబ్బంది ఆలీషా, జీవానందం, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వృద్ధుడి మృతి

రాజోలు: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందాడు. రాజోలు పోలీసుల కథనం ప్రకారం.. తాటిపాక మఠం గ్రామానికి చెందిన మామిడిశెట్టి వెంకట్రావు (65) సోమవారం పాదలాడ మీదుగా మొగలికుదురులోని పొలానికి సైకిల్‌పై బయలుదేరాడు. ఈ నేపథ్యంలో పాదలాడలో వెంకట్రావును వెనుక నుంచి భీమవరం నుంచి అమలాపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇక పారిశ్రామిక పరుగులు

- కలవచర్లలో ఇండస్ట్రియల్ పార్కు
- రూ.60.65 కోట్లతో పనులు
- నేడు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి భూమిపూజ
- వేలాది మందికి ఉపాధి అవకాశాలు


ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు కలవచర్లలో కేటాయించిన ప్రాంతం

రాజానగరం: ఇక పారిశ్రామిక రంగం పరుగులు పెట్టనుంది.. యువతకు ఉపాధి దరిచేరనుంది.. ఈ సదుద్దేశంతో రాజానగరం మండలం కలవచర్లలో ఇండస్ట్రియల్ పార్కు రూపుదిద్దుకునేందుకు మార్గం సుగమం కానుంది. సుమారు రూ.60.65 కోట్లతో చేపట్టే ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ మంగళవారం ఉదయం ఇక్కడ భూమిపూజ చేయనున్నారు. ఈ ప్రాజెక్టు అమలుకు సంబంధించి భారత ప్రభుత్వ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ) మంత్రిత్వ శాఖ డైరెక్టర్ ఉమేష్‌చంద్ర శుక్లా గత ఏడాది నవంబరు 21న ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. దీంతో నియోజకవర్గంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి, పారిశ్రామిక ప్రగతితో పాటు నిరుద్యోగులకు స్థానికంగానే ఉద్యోగావకాశాలు కల్పించాలనే రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా సంకల్పం కార్యరూపం దాల్చనుంది. ఇది పూర్తయితే స్థానికంగా యువతకు ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయి. ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బంది తప్పుతుంది. ఈ ప్రాజెక్టును ఎమ్మెల్యే రాజా ప్రతిష్టాత్మకంగా తీసుకుని, శరవేగంగా పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసే ఇండస్ట్రియల్ పార్కు కోసం రాజానగరం మండలం కలవచర్లలో సుమారు రూ. 40 కోట్లతో ఇప్పటికే 104 ఎకరాల భూమిని సేకరించారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం మరో రూ. 20.65 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈ వ్యయంలో కేంద్రం రూ. 10.50 కోట్లను గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా కేటాయించగా, మిగిలిన రూ. 10.15 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలు, మౌలిక సదుపాయాల సంస్థ ద్వారా సమకూర్చనుంది. ఈ మొత్తంలో ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో అంతర్గత రోడ్ల నిర్మాణానికి రూ. 12.71 కోట్లు, నీటి సదుపాయం, మురుగునీటి పారుదల వ్యవస్థలకు రూ. 7.63 కోట్లు, ప్రీ ఆపరేటివ్ ఖర్చులకు కోసం రూ. 30 లక్షలు ఖర్చు చేయనున్నారు. ఈ పనులకు ఇప్పటికే ప్రణాళిక రూపొందించారు.

నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కృషి



నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్యను సాధ్యమైనంత వరకూ పరిష్కరించాలనే సంకల్పంతో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు చేసిన ప్రయత్నాలు ఇప్పటికి కార్యరూపం దాలుస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. దీనివల్ల ఈ ప్రాంతం పారిశ్రామిక ప్రగతిని అందుకోవడంతో పాటు వేలాది మంది స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఇందుకు అవసరమైన సహకారం అందించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

–జక్కంపూడి రాజా, ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

దోపిడీ కేసులో నాలుగేళ్ల జైలుశిక్ష

రామచంద్రపురం రూరల్: ఏరుపల్లిలో జరిగిన దోపిడీ ఘటనకు సంబంధించి ఏ–2 ముద్దాయికి రామచంద్రపురం అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి కె.వెంకటేశ్వరరావు నాలుగేళ్ల కఠిన కారాగార శిక్ష, విధిస్తూ తీర్పు చెప్పినట్లు ద్రాక్షారామ ఎస్సై గెళ్ల సురేంద్ర సోమవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఏరుపల్లిలోని చల్లా వెంకటేశ్వరరావు ఇంట్లోకి 2010 డిసెంబర్ 30న అర్ధరాత్రి నిజామాబాద్ జిల్లా బాన్సువాడకు చెందిన తిల్పిడియా రంజిత్‌సింగ్ (బండా సింగ్) మరో 7 మందితో కలసి చొరబడి దోపిడీకి పాల్పడ్డాడు. చల్లా వెంకటేశ్వరరావు, అతని భార్య, మరో వ్యక్తి అల్లూరి పార్వతిలపై కత్తితో దాడిచేసి వారిని గాయపరిచి బంగారు తాడు, 4 బంగారు గాజులు దోచుకుపోయారు. బాధితుల ఫిర్యాదుపై అప్పటి ఎస్సై ఎండీ ఉమర్ కేసు నమోదు చేశారు. సీఐ ఎం.రాజారావు కేసు దర్యాప్తు చేసి నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును ప్రస్తుత ఎస్సై గేళ్ల సురేంద్ర స్పీడ్ ట్రైల్ కేసుగా గుర్తించి కోర్టు కానిస్టేబుల్ వాసిరెడ్డి జానకిరామయ్యతో కలసి సాక్షులను కోర్టులో హాజరు పరచగా జడ్జి పైవిధంగా తీర్పు చెప్పారు.

దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు

కాకినాడ సిటీ: మాజీ సైనికులు, మాజీ సైనిక వితంతువులపై ఆధారపడిన వారికి, ఈసీహెచ్ఎస్ కార్డులు కలిగి అంగవైకల్యం ఉన్న మాజీ సైనికులకు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు కృత్రిమ అవయవాలు అమర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా సైనిక సంక్షేమాధికారి ఎం.కృష్ణారావు సోమవారం తెలిపారు. కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలకు చెందిన వారు అర్హులన్నారు. వీరికి వోటూ బ్లాక్ హెల్త్‌కేర్, విశాఖపట్నం ద్వారా పరికరాలను అందజేస్తున్నట్లు వివరించారు. వీల్ చైర్లు, కృత్రిమ లిమ్బ్స్, పోస్థిటిక్ కీస్స్ తదితర ఆర్టిఫిషియల్ అవయవాలు అమర్చడానికి అవకాశం ఉందన్నారు. మాజీ సైనిక కుటుంబాలకు చెందిన సభ్యులు తమ దగ్గరలో ఉన్న ఈసీహెచ్ఎస్ హాస్పిటల్ ద్వారా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కృష్ణారావు కోరారు.

పంట పొలంలో వ్యక్తి మృతదేహం

కొత్తపల్లి: ఓ పంట పొలంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు సోమవారం పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. మండలంలోని కొండెవరం శివారు గోదావరి కాలువ సమీపంలోని పంట పొలంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైతు గుర్తించాడు. అతని వయసు 45–50 ఏళ్ల ఉంటుందని ఎస్సై స్వామినాయుడు తె లిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

భద్రతపై అవగాహనకే వాక్‌థాన్


వాక్‌థాన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఓఎన్జీసీ అసెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శంతనుదాస్

ఓఎన్జీసీ రాజమహేంద్రవరం అసెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శంతనుదాస్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పారిశ్రామిక భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు చైతన్యం తీసుకురావడానికే వాక్‌థాన్ నిర్వహిస్తున్నట్లు ఓఎన్జీసీ రాజమహేంద్రవరం అసెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఎసెట్ మేనేజర్ శంతనుదాస్ అన్నారు. సోమవారం ఓఎన్జీసీ రాజమహేంద్రవరం ఎసెట్ ఆధ్వర్యంలో 53వ జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా స్థానిక గెయిల్ కార్యాలయం నుంచి ఓఎన్జీసీ బేస్ కాంప్లెక్స్ ఆవరణ వరకూ వాక్‌థాన్ నిర్వహించారు. తొలుత దీనిని శంతనుదాస్ ప్రారంభించి మాట్లాడారు. ఓఎన్జీసీ తన ఆరోగ్య భద్రత– పర్యావరణ (హెచ్ఎస్ఈ) విభాగం ద్వారా చమురు– గ్యాస్ అన్వేషణ, ఉత్పత్తి కార్యకలాపాల్లో భద్రతా సంస్కృతిని ప్రోత్సహించడానికి ప్రతి సంవత్సరం 'నేషనల్ సేఫ్టీ వీక్' నిర్వహిస్తుందన్నారు. ఈ ఏడాది ఈఎస్‌జీ ఎక్సలెన్స్ కోసం భద్రతా నాయకత్వంపై దృష్టి పెట్టండి అనే నినాదంతో అనేక మాక్‌డ్రిల్‌లు, కార్యక్రమాలను నిర్వహించామన్నారు. రాజమహేంద్రవరం అసెట్ ఎల్లప్పుడూ ప్రమాదాలను నివారించడానికి, ఉద్యోగులందరికీ భద్రత కల్పించడానికి శ్రద్ధ వహిస్తుందన్నారు. ప్రచార సమయంలో, పారిశ్రామిక భద్రత గురించి ప్రజలను చైతన్యపరిచేందుకు కార్యాలయాల వద్ద సురక్షిత అభ్యాసాలపై వర్క్‌షాప్‌లు, కార్యాచరణ ప్రాంతాల చుట్టూ మాక్‌డ్రిల్‌లతో సహా అనేక కార్యకలాపాలు జరిపామన్నారు. అవసరమైన ప్రవర్తనా మార్పు తీసుకురావడానికి, సానుకూల మార్పులను అమలు చేయడానికి పాఠశాల విద్యార్థులను చైతన్యవంతం చేయడానికి క్విజ్‌లు, పోస్టర్ తయారీ, నినాదాల పోటీలు కూడా నిర్వహించామని ఎసెట్ మేనేజర్ వివరించారు. కార్యక్రమంలో బేసిన్ మేనేజర్ కర్వాసన్, సీనియర్ అధికారులు, ఎస్‌పీఎఫ్ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

వ్రత పురోహితులకు ఆరోగ్య బీమా


వ్రత పురోహితుల ఆరోగ్య బీమా ప్రీమియం చెక్‌ను స్టేట్ బ్యాంక్ బీఎం రఘురామ్‌కు అందిస్తున్న ఈఓ రామచంద్ర మోహన్

- భార్యాభర్తలకు ఏడాదికి రూ.6 లక్షల వైద్య సేవలు
- అవసరమైతే మరో రూ.3 లక్షల మంజూరు
- 254 మందికి ప్రయోజనం

అన్నవరం: స్థానిక వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో పని చేస్తున్న 254 మంది వ్రత పురోహితులకు ఆరోగ్య బీమా వర్తింపజేస్తూ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రూప్ మెడిక్లెయిమ్ హెల్త్ ఇన్సూరెన్స్‌తో ఒప్పందం ఖరారు చేశారు. దీనికింద వ్రత పురోహితుల భార్యాభర్తలకు ఏడాదికి రూ.6 లక్షల విలువైన వైద్య సేవలు అందిస్తారు. ఆ మొత్తం చాలకపోతే పురోహితులందరి అనుమతితో మరో రూ.3 లక్షలు కూడా ఇన్సూరెన్స్ సంస్థ మంజూరు చేస్తుంది.

పురోహితుల ఆరోగ్య బీమాకు రూ.38.50 లక్షల ప్రీమియం చెల్లించేలా గత నెలలో ఒక ప్రైవేటు ఇన్సూరెన్స్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకునేందుకు పురోహిత సంఘం నాయకులు దేవస్థానం ఈఓ కె.రామచంద్ర మోహన్‌కు ప్రతిపాదనలు పంపారు. అయితే ఒక్కో పురోహితునికి వార్షిక ప్రీమియం కింద రూ.15 వేలకు పైగా చెల్లించాల్సి రావడంతో ఆ ప్రతిపాదనను ఈఓ తిరస్కరించారు. తక్కువ ప్రీమియంతో ఎక్కువ వైద్య సేవలు అందించేలా ఇన్సూరెన్స్ సంస్థల నుంచి కొటేషన్లు తీసుకోవాలని ఆదేశించారు. దీనిపై 'వ్రత పురోహితులకు మెరుగైన ఆరోగ్య సేవలు' శీర్షికన ఈ నెల 1న 'సాక్షి' వార్త ప్రచురించింది. దీంతో పలు ప్రముఖ ఇన్సూరెన్స్ సంస్థలు ఏడాదికి రూ.39 లక్షల నుంచి రూ.32.42 లక్షల వరకూ ప్రీమియం చెల్లించేలా దేవస్థానానికి కొటేషన్లు అందజేశాయి. వాటిలో స్టేట్ బ్యాంక్ గ్రూప్ మెడిక్లెయిమ్ పాలసీకి అతి తక్కువగా రూ.32,42,640కు అందజేసిన కొటేషన్‌ను దేవస్థానం ఆమోదించింది. ఆ మొత్తానికి చెక్కును ఈఓ కె.రామచంద్ర మోహన్ స్టేట్ బ్యాంక్ బ్రాంచి మేనేజర్ రఘురామ్‌కు అందజేశారు. ఈ నెల 14 నుంచి పురోహితుల ఇన్సూరెన్స్ క్లెయిములు చెల్లించేందుకు ప్రయత్నిస్తామని రఘురామ్ చెప్పారు. తక్కువ ప్రీమియానికే హెల్త్ ఇన్సూరెన్స్ అందజేసి, వ్రత పురోహిత సంఘానికి రూ.6 లక్షలు ఆదా చేసిన ఈఓ రామచంద్ర మోహన్‌కు సంఘం మాజీ అధ్యక్షులు చామర్తి కన్నబాబు, నాగాభట్ల రవిశర్మ, కర్రి సూర్యనారాయణ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ లోకల్ హెడ్ అనురాధ, ఇన్‌చార్జి శ్రీనివాస్, దేవస్థానం సూపరింటెండెంట్ కంచి మూర్తి పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

సీతానగరం: పురుగు మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ముగ్గళ్లకు చెందిన కొయ్య సుధీర్‌కుమార్ (34) మద్యానికి బానిస అయ్యాడు. దీనిపై భార్య మందలించి రెండు రోజుల కిందట పుట్టింటికి వెళ్లిపోయింది. మనస్తాపం చెందిన సుధీర్‌కుమార్ సోమవారం ఉద యం పురుగు మందు తాగాడు. అతన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడని ఎస్సై వివరించారు.

శివనామ స్మరణతో సిరిసంపదలు


రౌతులపూడిలో శివతత్వంపై ప్రవచిస్తున్న చాగంటి కోటేశ్వరరావు

రౌతులపూడి: నిత్యం శివనామ స్మరణ చేయడం ద్వారా మానవాళి సుభిక్షంగా ఉంటుందని శారదా జ్ఞానపుత్ర వాచస్పతి, ప్రవచన బ్రహ్మ కళారత్న చాగంటి కోటేశ్వర రావు అన్నారు. సోమవారం రాత్రి స్థానిక ఉమా రామలింగేశ్వర స్వామివారి ఆలయ ప్రాంగణంలో కమిటీ ఆధ్వర్యంలో ఆయన శివతత్వంపై ప్రజలకు ఉద్బోధించారు. ఈ సందర్భంగా శివతత్వం విశిష్టత గురించి తెలుసుకుని ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికభావాలు పెంపొందించుకోవాలన్నారు. శివనామ స్మరణతో ఆరోగ్యంతోపాటు, ప్రజలంతా సుఖ సంతోషాలు, సిరి సంపదలతో తులతూగుతారన్నారు. ఇది మనిషికి ప్రాణవాయువు వంటిదని, శివ పురాణంలో అనేక విశేషాలను ఆయన భక్తులకు వివరించారు. ఆయనకు ముందుగా ఆలయ కమిటీ నిర్వాహకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. చాగంటి ప్రవచాలను వినేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ నిర్వాహకులు, శివభక్తులు పాల్గొన్నారు.

అయ్యప్పకు జ్యోతిష శిరోమణి బిరుదు


అయ్యప్పకు జ్యోతిష శిరోమణి బిరుదు అందించి శాలువాతో సత్కరిస్తున్న ప్రముఖులు

జగ్గంపేట: జగ్గంపేటకు చెందిన పురోహితుడు, జ్యోతిష పండితుడు మామిళ్లపల్లి అయ్యప్ప జ్యోతిష శిరోమణి బిరుదును అందుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని లలిత కళాక్షేత్రం, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో ఎస్ఎస్ లైవ్ ఆస్ట్రో అనే అంతర్జాతీయ సంస్థ ఆధ్వర్యంలో పురస్కారాల ప్రదానోత్సవం సోమవారం జరిగింది. సంస్థ అధినేత డాక్టర్ నరసింహస్వామి చేతుల మీదుగా జ్యోతిష శిరోమణి బిరుదును అయ్యప్ప అందుకున్నారు. అయ్యప్ప పురోహిత విభాగం రాష్ట్ర కార్యదర్శిగా, గురుస్వామిగా, జ్యోతిషరత్నగా అందరికీ సుపరిచితులు. జ్యోతిష్యంలో అయ్యప్ప మంచి ప్రావీణ్యం సంపాదించారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ సంస్థ బిరుదుతో సత్కరించింది. తనకు బిరుదు అందజేసిన ఎస్ఎస్ లైవ్ ఆస్ట్రో సంస్థకు అయ్యప్ప కృతజ్ఞతలు తెలిపారు. జగ్గంపేటలో ఆయన్ని ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, ప్రముఖులు అభినందించారు.

అగ్నివీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ సిటీ: ఇండియన్ ఆర్మీలో అగ్నివీర్ పోస్టుల భర్తీకి కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. జిల్లా సైనిక సంక్షేమాధికారి ఎం.కృష్ణారావు సోమవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. టెక్నికల్, జనరల్ డ్యూటీ, నాన్ టెక్నికల్, స్టోర్ కీపర్, ట్రేడ్స్‌మన్ పోస్టులకు ఎనిమిదో తరగతి, ఇంటర్మీడియెట్, ఐటీఐ చదివిన 17 నుంచి 21 ఏళ్ల లోపు వయస్సు ఉన్న వారు వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతిభ ఆధారంగా నియామకాలు జరుగుతాయని, దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని తెలిపారు. దరఖాస్తులకు ఈ నెల 22 చివరి తేదీ అని పేర్కొన్నారు.

టీడీపీ ప్రచార వాహనం ఢీకొని కూలి మృతి

సామర్లకోట: స్థానిక ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై టీడీపీ ఎన్నికల ప్రచార వాహనం ఢీకొని ఓ కూలి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. గంగనాపల్లికి చెందిన కొల్లు అప్పలరాజు (26) కూలి పనుల నిమిత్తం సామర్లకోటకు వచ్చాడు. అతను ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై రోడ్డు దాటుతుండగా టీడీపీ ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పకు సంబంధించిన ఎన్నికల ప్రచార రథం అచ్చంపేట నుంచి సామర్లకోట వస్తూ ఢీకొంది. దీంతో అప్పలరాజుకు తీవ్ర గాయాలు అయ్యాయి. అతన్ని కాకినాడలో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందినట్లు ఎస్సై మూర్తి తెలిపారు. మృతుడికి భార్య ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

మెడ్ యునైటెడ్ ఆసుపత్రి ప్రారంభం


మెడ్ యునైటెడ్ ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో చైతన్యరాజు తదితరులు

రాజానగరం: స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లో మెడ్ యునైటెడ్ ఆస్పత్రిని చైతన్య విద్యా సంస్థల చైర్మన్, జీజీయూ చాన్సిలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) సోమవారం ప్రారంభించారు. ఆధునిక పరికరాలు, అనుభవజ్ఞులైన వైద్య నిపుణుల సేవలు ఇక్కడ ప్రత్యేకత అని ఆయన అన్నారు. తమ సంస్థలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి ఆరోగ్య సంరక్షణతోపాటు విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ ఈ ఆస్పత్రిని ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ ఇతరులు కూడా వైద్య సేవలు పొందవచ్చని చైతన్యరాజు వివరించారు. ఆస్పత్రి ప్రొ చాన్సిలర్, అమలాపురం కిమ్స్ ఆస్పత్రి ఎండీ కె.రవికిరణ్‌వర్మ మాట్లాడుతూ ఈ ఆస్పత్రిలో టెలీ మెడిసిన్ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఆస్పత్రి ప్రొ చాన్సిలర్, గైట్ కళాశాల ఎండీ కె.శశికిరణ్‌వర్మ మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఆస్పత్రిలో జనరల్ వార్డును శశికిరణ్‌వర్మ, ఫార్మసీని రవికిరణ్‌వర్మ, కన్సల్టేషన్ గదులను డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ ఎంఎంఎస్ శర్మ, ప్రత్యేక గదులను డాక్టర్ టీవీ ప్రసాద్ ప్రారంభించగా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లక్ష్మిశశివర్మ జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

కన్నులపండువగా తెప్పోత్సవం

- భారీగా తరలివచ్చిన భక్తులు
- పాదగయ క్షేత్రంలో ముగిసిన మహాశివరాత్రి ఉత్సవాలు


పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామివారి తెప్పోత్సవం

పిఠాపురం: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పిఠాపురం పాదగయ క్షేత్రంలోని కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవార్ల తెప్పోత్సవం సోమవారం రాత్రి కనుల వైకుంఠంగా జరిగింది. మిరిమిట్లు గొలిపే విద్యుత్ కాంతులు తెప్పోత్సవంలో ఆకర్షణగా నిలిచాయి. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను హంస వాహనంపై ఉంచి పాదగయ పుష్కరిణిలో తెప్పోత్సవం నిర్వహించారు. హంసవాహనంపై స్వామి, అమ్మవార్లు పుష్కరిణిలో తిరుగుతున్న సమయంలో పాదగయ క్షేత్రం శివనామస్మరణ మార్మోగింది. పుష్కరిణిలో హంసవాహనాన్ని ఐదుసార్లు తిప్పారు. స్వామివారి తెప్పోత్సవాన్ని తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా శ్రీపుష్పోత్సవం

పాదగయ క్షేత్రంలోని కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవార్ల శ్రీపుష్పోత్సవం సోమవారం రాత్రి వైభవంగా జరిగింది. పండితులు స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించి బ్యాండుమేళాలు, బాజా భజంత్రీల మధ్య స్వామి, అమ్మవార్ల విగ్రహాలను సుమారు గంట సేపు ఉయ్యాలో ఉంచి శ్రీపుష్పోత్సవం నిర్వహించారు. స్వామివారి, అమ్మవార్లను ప్రత్యేక అలంకరణ చేశారు. వివిధ రకాల మిఠాయిలను అమ్మవారి వద్ద ఉంచారు. శ్రీపుష్పోత్సవాన్ని తిలకించడానికి వచ్చిన దంపతులకు తాంబూలాలు అందజేశారు. అనంతరం ఏకాంత సేవాగానం నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల శ్రీపుష్పోత్సవాన్ని తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కాగా పాదగయ క్షేత్రంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి.

డ్రైవర్‌కు ఆరు నెలల జైలు

తొండంగి: వాహనం నిర్లక్ష్యంగా నడిపి ఓ వ్యక్తి మృతికి కారణమైన డ్రైవర్‌కు తుని అడిషనల్ జూనియర్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కమ్ జూనియర్ సివిల్ జడ్జి స్వర్ణలత ఆరు నెలల జైలుశిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించారు. సోమవారం ఈ విషయాన్ని తొండంగి ఎస్సై బి.వినయ్‌ప్రతాప్ తెలిపారు. 2020 జూన్‌లో బెండపూడి జాతీయ రహదారిపై అన్నవరం వైపు వస్తున్న బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీకొనడంతో యు.కొత్తపల్లి మండలం శ్రీరాంపురం గ్రామానికి చెందిన మేడిశెట్టి బుల్లిబాబు మృతి చెందాడు. దీనిపై అప్పటి ఎస్సై సీహెచ్ విద్యాసాగర్ కేసు నమోదు చేశారు. ఈ కేసులో ప్రాసెక్యూషన్ తరఫున ఏపీపీ ఎస్.సునీత వాదనలు వినిపించగా, నేరం రుజువు కావడంతో జార్ఖండ్ రాష్ట్రం టాటానగర్‌కు చెందిన లారీ డ్రైవర్ అబ్దుల్ సాహెబ్‌కు జడ్జి ఆరు నెలల జైలుశిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించామని ఎస్సై వివరించారు.

విద్యుత్ షాక్‌తో కూలీ మృతి

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు పంచాయతీ పరదేశమ్మపేట చిన్నవెంకన్నబాబు గుడివీధికి చెందిన జట్టు కూలీ రాయుడు మహాలక్ష్మి(67) విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు కోరంగి పోలీసులు సోమవారం తెలిపారు. ఇంట్లో ఉన్న వాటర్ హీటర్ కారణంగా ఈ ప్రమాదం సంభవించిందన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కోరంగి ఎస్ఐ ఎస్.రవికుమార్ తెలిపారు.